క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

తిరుపతి కల్చరల్: ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాత మెటర్నిటీ ఆసుపత్రి రోడ్డులోని ఎస్వీఎస్ హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆర్.రఘురాములు తెలిపారు. షుగర్, బీపీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, కిడ్నీ సమస్యలు, రక్తహీనత, జ్వరాలు, గుండె వ్యాధులతోపాటు సీబీసీ, ఆర్‌బీఎస్, ఆర్ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్, ఇసీజీ తదితర పరీక్షలను ఉచితంగా చేసి మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.

వారపు సంతలో అన్నదానం

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో సోమవారం రైతులు, వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నదానం చేశారు. నాయకులు మాట్లాడుతూ రైతులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యాపారులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ భోజనాలు సరఫరా చేస్తున్నారని వివరించారు.

ఘాట్ రోడ్‌లో రోడ్డు ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతి వెళ్లే మొదటి ఘాట్ రోడ్‌లో సోమవారం కారు అదుపుప్పి కొండను ఢీకొంది. తమిళనాడుకు చెందిన శ్రీవారి భక్తులు దర్శనం ముగించుకుని తిరిగి బయలుదేరారు. ఒకటో మలుపు వద్ద వాహనం అదుపు తప్పి కొండను ఢీకొంది. కారు దెబ్బతినింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

పిల్లలకు దుప్పట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ



తిరుపతి కల్చరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవా రం ఓటేరు గంగిరెడ్డుల కాలనీకి చెందిన పిల్లలకు దుప్పట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసున్నీషా బేగం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి కోసం ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఓటేరు వాసులు వాసు, పీటర్, దేవదానం, హేమచంద్ర, ఓటేరు కృష్ణ, ఇస్మాయిల్, పద్మనాభరెడ్డి, ట్రస్ట్ సభ్యులు శివ, మోహన్, రాయల్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ ధ్వజారోహణం



ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లిలో వెలసిన సుందరగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం పడిపూజ మహోత్సవ ధ్వజారోహణను ఆలయ ట్రస్టీలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయ శుద్ధి చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ధ్వజారోహణ పూజ సామగ్రిని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. కేరళ తంత్రిలతో ధ్వజారోహణ ఘట్టాన్ని కేరళ సంప్రాదయ పద్ధతిలో నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు దుర్గాపూజతో పడిపూజ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ ట్రస్టీ లెక్కల పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏటా నవంబర్‌లో పడిపూజ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ జాస్తి కృష్ణకిషోర్, విర్కో బయోటెక్ అధినేత మురళీకృష్ణారెడ్డి, ప్రసాద్ ఆదిత్య, అర్చకులు త్రివిక్రమ్, గురుస్వాములు వేణుగోపాల్ నాయుడు, చంద్రాస్వామి, మోహన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం



అమ్మవారిని దర్శించుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన





అమ్మవారికి ఊంజల్ సేవ, వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు ఆదివారం సింహవాహనంపై యోగలక్ష్మిగా, సోమవారం రాజమన్నార్‌గా హనుమంత వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాలు చక్కటి ప్రదర్శనలిచ్చాయి.

– చంద్రగిరి(తిరుచానూరు)



అమ్మవారి వాహన సేవలో జీయంగార్లు



అమ్మవారి వాహన సేవలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి









కీర్తనలు ఆలపిస్తున్న గాయనీ, గాయకులు







కళాకారుల కళా ప్రదర్శనలు

భక్తిశ్రద్ధలతో కేదార నోములు



దేవేంద్ర థియేటర్ వద్దనున్న శివాలయంలో నోములు నోచుకుంటున్న మహిళలు



మంగళంలోని ఈశానేశ్వర నవ లింగ క్షేత్రంలో..



నోములు నోచుకుంటున్న భక్తులు

తిరుపతి కల్చరల్: దీపావళి పండుగను పురస్కరించుకొని సోమవారం తిరుపతి నగరంలోని పలు ఆలయాల్లో కేదార నోములను భక్తిశ్రద్ధలతో నోచుకున్నారు. దేవేంద్ర థియేటర్ వద్దనున్న శివాలయం, మంచినీళ్లగుంట శివాలయం, ఆయా వీధుల్లోని అమ్మవారి ఆలయాలు, భజన మందిరాల్లో ప్రత్యేకంగా గౌరీదేవిని కొలువుదీర్చి నోములు చేపట్టారు.

భాకరాపేటలో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో సోమవారం కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భీమేశ్వర స్వామి ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించారు. అదేవిధంగా పెద్ద సంఖ్యలో నోములు నోచుకున్నారు. ఆలయ అర్చకులు చిన్నారి స్వామి నోముల విశిష్టతను వివరించారు.

నేటి నుంచి ధ్యానారామంలో కార్తీకమాస రుద్రాభిషేకం

తిరుపతి కల్చరల్: ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో నున్న ధ్యానారామంలోని బృహదీశ్వరస్వామికి మంగళవారం నుంచి నెల రోజులు లోక క్షేమాన్ని కాంక్షిస్తూ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాన్ని శైవాగమ పండితులతో చేపడతారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీ భక్తి ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

నాగాభరణం, త్రిశూలం బహూకరణ

ధ్యానారామంలోనున్న బృహదీశ్వరస్వామికి తిరుపతికి చెందిన ఆర్.శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ మునిశంకర్‌రెడ్డి, వేదవర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ పి.ఆంజిరెడ్డి రూ.4 లక్షలు విలువైన పంచలోహాల నాగాభరణం, త్రిశూలాన్ని బహూకరించారు. అలాగే తిరుపతికి చెందిన కమల శ్రీనివాసన్ రూ.20 వేలు పరదాలు అందజేశారు. వేదవర్సిటీ రిజిస్ట్రార్ ఏవీ.రాధేశ్యామ్, టి.బ్రాహ్మాచార్యులు, ఆర్.సత్యనారాయణ, పి.నీలకంఠం పాల్గొన్నారు.



ఆభరణాలు బహూకరిస్తున్న దాతలు

ఇంటర్ విద్యార్థి అరుదైన ఘనత

- జేఈఈ జాడర్ అడ్వాన్స్ వెబ్‌సైట్ రూపకల్పన
- వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న కొటాల కిషన్‌రెడ్డి అరుదైన ఘనతను సాధించారు. ఐఐటీలో విద్యార్థుల కష్టాలను సులభంగా పరిష్కరించవచ్చో అన్న అంశంపై ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ను కనిపెట్టారు. చంద్రగిరి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొటాల పద్మజ కుమారుడు కొటాల కిషన్ రెడ్డి శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. జేఈఈ మెయిన్స్ కోసం కొన్నాళ్లుగా వెబ్‌సైట్ రూపకల్పనకు కసరత్తు చేశాడు. చివరకు తను అనుకున్నది కనిపెట్టడంతో ఆదివారం చంద్రగిరిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కొటాల కిషన్ రెడ్డి మాట్లాడుతూ జేఈఈ ప్రవేశ పరీక్షలు చాలా కష్టంగా ఉంటాయని, చాలామంది సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో వెనుబడిపోతున్నారన్నారు. ఈ వెబ్‌సైట్‌లో కావాల్సిన సమాచారంతో పాటు అర్థం కాని టాపిక్స్, ప్రాబ్లెమ్స్, రీసెర్చ్ పేపర్లు, ప్రీవియస్ పేపర్లు వస్తాయన్నారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి పాల్గొన్నారు.



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

నేటి నుంచి వై ఏపీ నీడ్స్ జగన్

పాకాల : మండలంలోని 19 సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి అంటే అన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఒక్కో సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల బోర్డులను ప్రదర్శించి, ప్రజలు ప్రత్యక్షంగా పొందిన లబ్ధిని వివరిస్తారని తెలిపారు.

యువకుడిపై దాడి

చంద్రగిరి: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై కొంతమంది యువకులు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం కలకలం రేపింది. చంద్రగిరి పాతపేటకు చెందిన ఒంటి బాబిరెడ్డి ఆదివారం చంద్రగిరిలోని బ్రిడ్జి వద్ద కారు ఆపాడు. అదే సమయంలో తిరుపతికి చెందిన కొంతమంది యువకులు కారును పక్కకు తీయాలంటూ గొడవకు దిగి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అక్కడి నుంచి తప్పించుకున్న బాబిరెడ్డి చంద్రగిరి టవర్ క్లాక్ సర్కిల్ వద్దకు చేరుకున్నాడు. వారు అతన్ని వెంబడించి మరోసారి దాడికి పాల్పడ్డారు. స్థానికులు వారిని అడ్డుకుని దాడి చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తిరుపతికి చెందిన యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

25 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్టు

పాకాల : మండలంలో సోమవారం కోడి పందెం ఆడుతున్న 25 మందిని అరెస్టు చేసినట్లు సీఐ ఓబులేసు తెలిపారు. ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు బావిరంగన్నగారి చెరువు, గానుగపెంట రోడ్డు మధ్యలోని చలమోలు గుట్ట వద్ద కోడి పందేలు ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,13,300 నగదు, 8 పందెం కోళ్లు, 12 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పారిపోయిన వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

ప్రయాణికుల నమ్మకాన్ని పొందాలి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు ఆదర్శంగా ఉంటూ ప్రయాణికుల నమ్మకాన్ని పొందాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాబడితోపాటు ప్రజల్లో నమ్మకాన్ని కూడా కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ సురక్షిత ప్రయాణాన్ని అందించాలని కోరారు. ప్రయాణికుడు చెయ్యి ఎత్తిన ప్రతి చోటా బస్సులను ఆపి ఎక్కించుకోవాలని సూచించారు. ముఖ్యంగా రిక్వెస్ట్ స్టాపింగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తిరుపతి బస్టాండ్‌కు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించి ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.

నేడు ఇస్కాన్‌లో గోపూజ, గోవర్ధన్ మహోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మందిరం అధ్యక్షుడు రేవతిరమణదాస్, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణ భగవానుడు గోవర్ధన గిరిని ఎత్తి గోపాలురు, గోవులను సంరక్షించిన రోజును పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో మంగళవారం గోపూజ, గోవర్ధన్ పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతిరమణదాస్ తెలిపారు. ఆయన సోమవారం ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి గోవర్ధన్ పూజా మహోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోవర్ధన్ పూజా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో శ్రీకృష్ణుని గోవర్ధన గిరి ఎత్తిన ప్రతిభను ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు గోవర్ధన్ లీలపై ప్రవచనం చేపడుతున్నట్లు తెలిపారు. 11.30 గంటలకు శ్రీగిరి గోవర్ధన్‌కి మహా శంఖాభిషేకం నిర్వహిస్తామన్నారు. అలాగే 27వ తేదీ వరకు ఇస్కాన్ మందిరంలో ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కార్తీక దామోదర హారతి చేపట్టనున్నట్లు తెలిపారు. 17న ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులు భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల వారి తిరోభావ దినోత్సవం చేపడుతున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎన్ఎస్‌యూలో దీపావళి పండుగ



సంస్కృత వర్సిటీలో వెలిగించిన దీపాలు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం సాయంత్రం దీపావళి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీలో రఘునాథాచార్యముక్త ప్రాంగణంలో సుందరకాండ పారాయణం చేశారు. అనంతరం లక్ష్మీదేవి పూజ చేశారు. విద్యార్థులకు దీపావళి విశిష్టతను వివరించారు. దీపావళి పండుగలో 'దీప ఆవళి' అంటే దీపముల వరుస అని, దీప ప్రజ్వలన అనేది మనసులోని భావాన్ని బయటకు తీసుకురావడమని వివరించారు. దీపమే పరబ్రహ్మ అని, జ్ఞాన దీపాన్ని వెలిగించి శాస్త్రాల్లోని జ్ఞానాన్ని సమాజానికి అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు 10 వేలకు పైగా దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో వీసీ ధర్మపత్ని రామలక్ష్మి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రమాశ్రీ, అధికారులు ఆచార్య చక్రవర్తి రాఘవన్, సత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ వైవీ కృష్ణారావు పాల్గొన్నారు.

క్విజ్ గ్రాండ్ ఫినాలే ఏర్పాట్ల పరిశీలన



క్విజ్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్మార్ట్ సిటీ, తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం కచ్చపి ఆడిటోరియంలో క్విజ్ గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తున్నట్లు స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన పోటీలకు సుమారు 101 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో ముందు వరుసలో నిలిచిన 8 పాఠశాలల విద్యార్థులను గ్రాండ్ ఫినాలేకి ఎంపిక చేశామని, వారికి బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామన్నారు. వారికి మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతి కింద రూ.50 వేలు, మూడో బహుమతి రూ.25 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి 3 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యం విద్యార్థులు సరైన సమయంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ వెంట స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై రెండు కేసులు నమోదు

- అనుమతి లేకుండా పోస్టర్లు అంటించిన ఫలితం
- పోస్టర్లు తొలగించిన లేబర్ ఖర్చులు కూడా చెల్లించాలని నోటీసులు



పోస్టర్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో అనుమతి లేకుండా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై నిషేధం కొనసాగుతోంది. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ పేరూరు డివిజన్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్ ఇటీవల పేరూరు, తుమ్మలగుంటలోని పలు ప్రాంతాల్లో పోస్టర్లు అతికించారు. అందుకు పంచాయతీల నుంచి అనుమతి తీసుకోకపోవడంతో అధికారులు కొరడా ఝళిపించారు. పోస్టర్లను పూర్తిగా తొలగించడంతోపాటు చెంచుమోహన్ యాదవ్‌పై పేరూరు, తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శులు మాధవి, మధుసూదన్‌రావు తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగక పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించేందుకు అయిన లేబర్ ఖర్చులను సైతం చెల్లించాలని నోటీసులు జారీ చేశారు.

పంచాయతీ కార్యదర్శుల ఫిర్యాదు మేరకు చెంచుమోహన్‌యాదవ్‌పై రెండు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీల వారు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా పోస్టర్లు అంటించినా, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సిల్వర్ జూబ్లీ వేడుకలకు కేంద్ర మంత్రికి ఆహ్వానం

తిరుపతి సిటీ : స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో త్వరలో జరగనున్న ఉత్కల పీఠం (ఒడిశా చైర్) సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనాలని వీసీ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. ఆయన సోమవారం ఢిల్లీలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. విశ్వవిద్యాలయంలో ఉత్కల పీఠం స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా త్వరలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. మంత్రిని కలసిన వారిలో ఉత్కల పీఠం డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజన్ పండా ఉన్నారు.

ఆనంద హేళ



జీవితంలోని చీకటిని పోగొట్టి వెలుగును పంచేది దీపావళి. ఈ పండుగ అంటే అందరికీ సంబరమే. తిరుపతి నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా టపాసులు పేలుస్తూ, దీపాలు వెలిగిస్తూ దీపావళి పండగులను ఆనందంగా జరుపుకున్నారు. మిరుమిట్లు గొలుపుతూ ఆకాశంలో నక్షత్రాలను తలపించేలా తారాజువ్వలు కాంతిని వెదజల్లడంతో తిరుపతి నగరం కాంతులీనింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

